క్లుప్తంగా

చివరి ఆయకట్టుకు సాగునీరందించండి

- నీటి పారుదల శాఖ అధికారులను కోరిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



కమలాపూర్ : చివరి ఆయకట్టుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు సాగు నీటి ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అనిల్ కుమార్‌ను గురువారం కలిసి సమస్యను వివరించి వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు. మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట, శనిగరం, గోపాల్‌పూర్, బత్తినివానిపల్లి, లక్ష్మీపూర్, కానిపర్తి, శంభునిపల్లి గ్రామాలకు చివరి తడి సాగునీరు అందక చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే డీబీఎం 20, 21, 22, 23, 24 ద్వారా సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ పిల్లలు, తల్లులకు వైద్య పరీక్షలు



ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లి, అగ్రంపహాడ్ గ్రామాల్లో అంగన్‌వాడీ పిల్లలకు, వారి తల్లులకు గురువారం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం వైద్య పరీక్షలు చేశారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే పరకాల బీటీం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీం, వైద్య సిబ్బంది బోస్ బాబు, కవిత, అంగన్‌వాడీ టీచర్లు జమున, సుమలత పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి ఎంబటి రాజు గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు సదాశివరెడ్డి, కొత్తగట్టు సాయి, పెంబర్తి శివ, వినయ్, తోట గణేశ్, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

ఎంపీ కావ్య జన్మదినం


వేలేరు : వరంగల్ ఎంపీ కడియం కావ్య జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్ రెడ్డి, సలీం మాలిక్, అరవింద్, హరీఫ్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు




పరకాల : వేసవి దాహార్తి తీర్చుకునేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు అన్నారు. మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, పూర్ణ జ్యూవెల్లర్స్ ఆధ్వర్యంలో మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ రోడ్డులో పూర్ణ జ్యూవెల్లర్స్ యాజమాని సొంత ఖర్చుతో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వ్యాపారస్తులు జ్ఞానానందం, శ్యామ్, సదానందం, సురేష్, కేశవరెడ్డి, గోపి, శివ, రమేశ్, అభిలాష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బాలకృష్ణ, సూర్యప్రకాశ్, బిక్షపతి, సిద్ధు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఎన్నిక



రవితేజ, అధ్యక్షుడు



రాజు, ప్రధాన కార్యదర్శి

ఆత్మకూరు : ఫర్టిలైజర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా కామారం గ్రామానికి చెందిన నర్మెట్ట రవితేజ, ప్రధాన కార్యదర్శిగా నీరుకుళ్లకు చెందిన బలవంతుల రాజు, కోశాధికారిగా ఆత్మకూరుకు చెందిన రాజు, ఉపాధ్యక్షుడిగా పెద్దాపూర్ గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మత్తడికి మరమ్మతులేవీ..?

- రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకొన్న వైనం
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్



గండి పడి కొట్టుకుపోయిన కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి

కమలాపూర్ : కాకతీయుల కాలంలో సుమారు 445 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కమలాపూర్ పెద్ద చెరువు.. ఆయకట్టు కింద అధికారికంగా 1,272 ఎకరాల్లో, అనధికారికంగా సుమారు 2 వేలకు పైచిలుకు ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. మండలానికి సాగు, తాగు నీరుకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ చెరువు వందలాది మత్స్య కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోంది. అయినప్పటికీ ఈ చెరువును పాలకులు, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రెండేళ్లైనా మరమ్మతులు లేవు

చెరువు కింద తమ పంట పొలాలు మునుగుతున్నాయనే కారణంతో గతంలో కొందరు రైతులు కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి రాళ్లను కొన్ని వరసలుగా తొలగించారు. దీంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గిపోయింది. దీనికితోడు 2023 జూలై 26వ తేదీన రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకి నీటి ఉధృతికి తట్టుకోలేక చెరువు మత్తడి దెబ్బతిని గండి పడింది. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు మత్తడికి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో గండి పడిన మత్తడికి అధికారులు తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకొన్నారని, ఆ మరునాడే భారీ వర్షం కురిసి ఆ ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకితే మూడు ఫసళ్లు సాగు అవడంతో పాటు మరో పంటకు సంబంధించి నారుమడులకు నీళ్లు సరిపడేవని, ప్రస్తుతం చెరువు నిండితే రెండు ఫసళ్లకే సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తడికి మరమ్మతులు చేపట్టాలి



2023లో కురిసిన అతి భారీ వర్షాలకు కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి గండి పడి కొట్టుకుపోయింది. రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు మత్తడికి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చెరువులో నీటి నిల్వ తగ్గిపోయింది. చెరువు మత్తడిని మరమ్మతు చేయాలని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా స్పందించలేదు. ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.

\- మురళీకృష్ణ, మత్స్య సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

3భారీ వర్షాలకు దెబ్బతిని గండి పడిన కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. అనుమతుల కోసం వేచి చూస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మత్తడి మరమ్మతుల పనులు చేపడుతాం.

\- శశిభూషణ్, ఇరిగేషన్ ఈఈ

పోషకాహారంతోనే బిడ్డకు ఆరోగ్యం

- డీడబ్ల్యూఓ జయంతి



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న డీడబ్ల్యూఓ జయంతి

దామెర : గర్భిణులు పోషకాహారం తీసుకుంటేనే కడుపులోఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని డీడబ్ల్యూఓ జయంతి అన్నారు. గురువారం మండలంలోని ఊరుగొండ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణపక్షం కార్యక్రమంలో సీడీపీఓ స్వాతితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలను పట్టించాలని, దీంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. గర్భిణులు, తల్లులు రక్తహీనత రాకుండా ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లలో మెరుగైన ఆహారాన్ని అందిస్తున్నారని, గర్భిణులు అంగన్‌వాడీ ఆహారాన్ని తినాలని సూచించారు. అనంతరం సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, పోషన్ అభియాన్ అధికారి భిక్షపతి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, నిర్మల, విజయ, విజిత, ఆయాలు, ఆశలు పాల్గొన్నారు.

పరకాల : మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారని, రక్తహీనత కలుగకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. ఇంటింటా పోషణ సంబురాల్లో భాగంగా పోచారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పు దినుసులు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చిని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు భాగ్యలక్ష్మి, మంజుల, శాంత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

బీజేపీ 'గావ్‌చలో-బస్తీ చలో'



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం గావ్ చలో- బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయరాకుల మొగిలి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలుపేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేల ముంచిందని, ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు, వాగ్దానాలు చేసి మరిచిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు మంద సురేశ్, బూత్ అధ్యక్షుడు మధు, నాయకులు దినేశ్, వెంకటేశ్, కిరణ్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

కమలాపూర్ : మహిళల కోసం అమలు చేస్తున్న చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని అంబాల జెడ్పీ హైస్కూల్లో సఖి సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి వాటి నుంచి రక్షణ కల్పించేందుకు సఖి సెంటర్ పని చేస్తుందన్నారు. సమస్య ఎదురైతే ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు కాల్ చేస్తే తక్షణ సాయం, రక్షణ కల్పిస్తామన్నారు. అదే విధంగా 0870 2452112, 7382983088 నంబర్లకు కాల్ చేస్తే బాధిత మహిళలకు సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్లు భారతి, భాగ్యలక్ష్మి, దేవి, రజిత, సునీత, గీత, స్వశక్తి సంఘాల మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బహుజన పోరాట యోధుడు ప్రభాకర్



ఎల్కతుర్తి : తెలంగాణ బహుజన పోరాట యోధుడు చెప్యాల ప్రభాకర్ అని మహనీయుల ఉత్సవ కమిటీ మండల చైర్మన్ కొలుగూరి రాజు అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అమరవీరుల స్తూపం వద్ద బహుజన ఉద్యమకారుడు చెప్యాల ప్రభాకర్ 56వ జయంతిని నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షరిఫొద్దీన్, కొమురయ్య, ప్రకాశ్, భిక్షపతి, సుధాకర్, వెంకటస్వామి, రమేశ్, తిరుపతి, సంపత్, ప్రేమ్, శ్రీకాంత్, సాంబయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

'మా భూమి' రథయాత్రను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు / శాయంపేట : ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రాంగణంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టనున్న లక్ష కిలోమీటర్ల 'మా భూమి' రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మైదం రవి పిలుపునిచ్చారు. ఆత్మకూరు, శాయంపేట మండల కేంద్రాలో గురువారం రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ చైతన్యాన్ని అందిస్తూ రాజ్యాధికార సాధనే లక్ష్యంగా చేపట్టనున్న రథయాత్రకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రజనీకాంత్, కార్యదర్శి మాదాసి సుధాకర్, నాయకులు అమరేందర్, మధు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై రాస్తారోకో

హసన్‌పర్తి: పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతోందని విమర్శించారు. అదానీ, అంబానీ లాంటి బడా బాబులకు కొమ్ము కాస్తూ దేశ సంపదను వారికి అప్పగిస్తోందని ఆరోపించారు. పెరిగిన ధరలను ఉపసంహరించుకోకుంటే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పద్మ, సురేందర్, లింగయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇంద్రసేనారెడ్డి

ఎల్కతుర్తి : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. మండలంలోని సూరారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోద్దని చెప్పారు. ఏగ్రేడ్‌కు రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఏఓ రాజ్‌కుమార్, ఏపీఎం రవీందర్, సీసీ రవీందర్, రైతులు పాల్గొన్నారు.

ఓదెలుకు సన్మానం



ఓదెలును సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

వేలేరు : ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించిన కుమ్మరి ఓదెలును గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు స్వజని, శారద, నాగజ్యోతి, నరసయ్య, శ్రీనివాస్, సందీప్, వలీహుస్సేన్, రాజేందర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



హన్మకొండ అర్బన్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు కృషి చేయాలని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవీంద్రకుమార్ రవి సూచించారు. నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతను తీవ్రంగా పట్టి పీడిస్తున్న సమస్య డ్రగ్స్ అని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ఎన్‌సీసీ కేడెట్ల పాత్ర కీలకమని వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి 'సే నో టు డ్రగ్స్' ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ రేవతి ప్రభాకరన్ పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

- కార్పొరేట్ సంస్థలను రక్షించేందుకే నక్సలిజంపై బీజేపీ ఉక్కుపాదం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కమలాపూర్ : కేంద్ర ప్రభుత్వం మరోసారి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరస్తుందని, మోదీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు మాత్రం లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సీపీఐ గ్రామ శాఖ మహాసభకు ఆయన హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో నక్సలైట్లు లేకుండా చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పడం వీధి రౌడీ వ్యాఖ్యలను తలపిస్తోందని, అటవీ సంపదను, కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. భూమి కోసం పోరాడే కమ్యూనిస్టులను, నక్సలైట్లను లేకుండా చేయడం ఎవరి తరం కాదన్నారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు ఐక్యం అవుతుంటే మన దేశం మాత్రం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలిచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలు తిరగబడక ముందే ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఆవిర్భవించిన ఈ వందేళ్లలో అనేక త్యాగాలు చేసిందని, జాతీయ స్థాయిలో భూ పోరాటాలకు పిలుపునిచ్చి దేశంలో భూ సంస్కరణలకు కారణమైందని, భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చి లక్షలాది మందికి భూమిని పంచిందన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, మండల కార్యదర్శి ఓదెలు, రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు జక్కు రాజుగౌడ్, ధర్ముల రామ్మూర్తి, నెట్టెం నారాయణ, బొజ్జం లక్ష్మి, జేరుపోతుల లచ్చయ్య, శిరీష, గోటి మహేందర్, మాట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పార్టీలతో రాష్ట్రానికి లాభం లేదు



ఆత్మకూరు : మాట్లాడుతున్న ధర్మారెడ్డి



ధర్మసాగర్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ఆత్మకూరు : ఢిల్లీ పార్టీలతో రాష్ట్రానికి నష్టమే తప్పా లాభం లేదని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఘాటు విమర్శలు చేశారు. ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ సందర్భంగా గురువారం ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ గ్రామంలోని జీఆర్‌ఎస్ గార్డెన్స్‌లో ఆత్మకూరు, దామెర మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడుతూ.. 25 ఏళ్ల రజతోత్సవ గులాబీ పండుగకు లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్తపైన ఉందన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్ పతనం ఖాయమని, ఆ సభ పేరు వింటేనే ఇతర పార్టీలకు వణుకు పడుతుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సభ జరగొద్దని మోకాలడ్డుపెడుతుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన సభ నిర్వహణను ఆపలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో రాష్ట్రానికి నష్టం తప్పా లాభం లేదని, ఆరు గ్యారంటీలు ఎటు వెళ్లాయో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మకూరు, దామెర మండలాల అధ్యక్షులు సంజీవరెడ్డి, రాము, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, బహిరంగ సభ ఇన్‌చార్జ్ శోభన్ బాబు, కేశవరెడ్డి నాయకులు జాకీర్ అలీ, మల్లయ్య, రవియాదవ్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ఈనెల 27వ తేదీన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. సాయిపేట గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ధర్మసాగర్ మండలానికి దగ్గరలో నిర్వహిస్తున్న సభకు ధర్మసాగర్, వేలేరు మండలాల నుంచి దాదాపు 10 వేల మంది రావాలని కోరారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టంతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి కూతురి ఎంపీ సీటు కోసం 100 కోట్లకు అమ్ముడుపోయిన వ్యక్తికి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. త్వరలో సుప్రీంకోర్టు తీర్పు వస్తుందని, కొద్ది రోజుల్లోనే ఉప ఎన్నికలు వస్తాయని జోస్యం చెప్పారు. కడియం శ్రీహరికి రాజ్యాంగం మీద గౌరవం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండల ఇన్‌చార్జ్ సోమిరెడ్డి, నాయకులు బొడ్డు ప్రభుదాస్, రవీందర్, కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాల : పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

పరకాల : రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని, కేంద్రంలో నిరంకుశ పాలన కొనసాగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల మండలం కామారెడ్డిపల్లిలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ఆయన పాల్గొని గ్రామ ప్రజలతో కలిసి రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగంపై జరుగుతున్న ప్రమాదాన్ని ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మతతత్వ రాజకీయాలకు పాల్పడుతూ, రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతున్న బీజేపీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకించాలని అన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కొప్పుల గ్రామంలో గురువారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకుందామని ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చల్లా చక్రపాణి, మారెపల్లి రవీందర్, చిందం రవి, శంకర్, మధుసూదన్, కుమారస్వామి, కట్టయ్య, కృష్ణమూర్తి, జగన్, రాజు, రవీందర్, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

శాయంపేట : ఈనెల 26వ తేదీన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్పగ్రాండ్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేయనున్న మెగా జాబ్ మేళాలో మండలంలోని అన్ని గ్రామాల్లోని యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఐకేపీ సీసీలకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశ వర్కర్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన జాబ్ మేళాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఈనెల 26న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్పగ్రాండ్‌లో సుమారు 700 కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, ఐకేపీ సీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారం చేయాలని సూచించారు. జాబ్ మేళాకు వెళ్లే యువతీ యువకులు స్టాల్స్, రిజిస్ట్రేషన్ సెంటర్లలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జాబ్ మేళాకు వెళ్లే అభ్యర్థులకు బస్సు సౌకర్యం, తాగునీరు, మజ్జిగ పాకెట్స్, భోజన వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శాయంపేట మండల ప్రత్యేకాధికారి విద్యాలత, ఏఓ గంగాజమున, అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, ఐకేపీ సీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. సతీష్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)